




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 97 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 17 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 97 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 17 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఢిల్లీలో ఏవియేషన్ సంస్థను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

- ఢిల్లీలో చార్లీ ఫాక్స్‌ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్‌ను ప్రారంభించిన నారా లోకేశ్
- తన అట్లాంటా పర్యటనలో ఈ సంస్థ ఏర్పాటు ఆలోచన వచ్చినట్లు వెల్లడి
- దేశ విమానయాన రంగానికి నైపుణ్యవంతులను అందించడమే లక్ష్యం
- యువ పైలట్ క్యాడెట్లతో ముచ్చటించిన మంత్రి లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దేశ రాజధాని ఢిల్లీలో 'చార్లీ ఫాక్స్‌ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్' అనే సంస్థను ప్రారంభించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న ఆయన ఈ సంస్థ కార్యకలాపాలను

- మిగతా 2లో...

## చంద్రబాబు ముందుచూపు ఉన్న నేత..



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో నవ్యాంధ్రకు కొత్త దశ-దిశ లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.



ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. బిల్ గేట్స్ రాకను చారిత్రాత్మకమని అభివర్ణించిన సీఎం, ఈ భాగస్వామ్యం రాష్ట్ర

- అమరావతిలో సీఎం చంద్రబాబుతో బిల్ గేట్స్ సమావేశం
- స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను వివరించిన ముఖ్యమంత్రి
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో భాగస్వామ్యానికి నిర్ణయం
- కుప్పం 'సంజీవని' ప్రాజెక్టుపై బిల్ గేట్స్ ప్రత్యేక అభినందన

ప్రజల సాధికారతకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. 1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన నాటి నుంచి తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**చంద్రబాబు విజనరీ అని ఆనాడే తెలిసింది**

ఈ సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్, భారత డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తాను తొలిసారి చంద్రబాబును

- మిగతా 2లో...



## అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

- సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీడ్రా నిర్వహించిన కేసు
- అంబటికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరిన న్యాయవాది పొన్నవోలు
- పూర్తి స్థాయి విచారణ కోసం కస్టడీ అవసరమన్న పోలీసుల తరపు న్యాయవాది

**పెన్ పవర్ డెస్క్:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది. ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరఫున

- మిగతా 2లో...



## ఏఐ సమ్మిట్..భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం

- ఢిల్లీలో ప్రారంభమైన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026
- 80 దేశాల ప్రతినిధులు, 500 మందికి పైగా ఏఐ నిపుణుల హాజరు
- ఫిబ్రవరి 19న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ప్రసంగం
- గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం
- ఏఐ ఛాలెంజ్‌ల ఫైనలిస్టులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు

**పెన్ పవర్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో 80కి పైగా దేశాల నేతలు, 500 మందికి పైగా గ్లోబల్ ఏఐ నిపుణులు, సీఈఓలు, పరిశోధకులు పాల్గొంటున్నారు. సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చిస్తారు. గ్లోబల్ సౌత్‌లో

- మిగతా 2లో...

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ తో బిల్ గేట్స్...



- ఏపీకి విచ్చేసిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్
- అమరావతిలోని సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎంలతో భేటీ
- గేట్స్ కు మంత్రులను పరిచయం చేసిన చంద్రబాబు

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మైక్రోసాఫ్ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న బిల్ గేట్స్... అక్కడి నుంచి నేరుగా అమరావతిలోని సచివాలయానికి చేరుకున్నారు. సెక్రటేరియట్ వద్ద ఆయనకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. అనంతరం బిల్ గేట్స్ కు మంత్రులను చంద్రబాబు పరిచయం చేశారు. ఆ తర్వాత వీరితో బిల్ గేట్స్ బృందం సమావేశమయింది.

## చంద్రబాబుతో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు... జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు

- చంద్రబాబు, జగన్ తీరును పోలుస్తూ రెండు ఫొటోలతో పార్థసారథి సోషల్ మీడియాలో పోస్ట్
- అమరావతిలో చంద్రబాబుతో భేటీ అయిన మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్
- డిజిటల్ పాలనలో చంద్రబాబు కృషి అమోఘమని బిల్ గేట్స్ ప్రశంస
- భారత డిజిటల్ విప్లవంలో మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులని కితాబు

**పెన్ పవర్ డెస్క్:** మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు గారితో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారుడ జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు" అంటూ సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన రెండు ఫొటోలను పోలుస్తూ

- మిగతా 2లో...





## మహిళలకు మరోసారి భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్

- శివరాత్రి సందర్భంగా మహిళల ఖాతాల్లో రూ. 10 వేల చొప్పున జమ
- సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళలు
- గత ఎన్నికలకు ముందు కూడా రూ.10 వేలు జమ చేసిన నితీశ్

**పెన్ పవర్ డెస్క్:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ. 10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ

- మిగతా 2లో...

## కరీంనగర్ మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ.. ఎన్నికను బహిష్కరించిన బీఆర్ఎస్

### మేయర్‌గా బీజేపీ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్

### శ్రీనివాస్‌కు 34, కాంగ్రెస్ అబ్యర్థి నర్మదకు 21 ఓట్లు

### కాంగ్రెస్‌కు మద్దతు పలికిన మజ్లిస్, ఇతరులు



**పెన్ పవర్ డెస్క్:** పుర ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఎంతో ఉత్కంఠగా మారిన కరీంనగర్ కార్పొరేషన్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది. కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ తొలిసారి దక్కించుకుంది. కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ పార్టీ తటస్థంగా వ్యవహరించింది. దీంతో బీజేపీ అభ్యర్థి గెలుపు సునాయాసమైంది. బీజేపీకి 34 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన మేయర్ అభ్యర్థి నర్మదకు 21 ఓట్లు వచ్చాయి. తొమ్మిది స్థానాలు ఉన్న బీఆర్ఎస్ ఎన్నికను బహిష్కరించింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో

- మిగతా 2లో...

## చైనా సరిహద్దు ప్రాంతంలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పర్యటన

- నరవణే పుస్తకం నేపథ్యంలో చైనా సరిహద్దుల్లో పర్యటన
- దేశ భద్రత విషయంలో రాజకీయం సరికాదని రాహుల్ గాంధీకి హితవు
- ప్రచురితం కాని పుస్తకం గురించి చెప్పడానికేముండదని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం వివాదం వేళ, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చైనా సరిహద్దుల్లో పర్యటించారు. ప్రచురితం కాని నరవణే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# టీచర్లకు ఏఐ ప్రత్యామ్నాయమా?

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం అవుతుందా అనే చర్చ జరుగుతోంది. అది ఒక సహాయక సాధనం మాత్రమే. తరగతి గదిలో మానవ స్పర్శ, సానుభూతి, స్ఫూర్తిని ఏఐ భర్తీ చేయలేదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏఐ అనేది ఉపాధ్యాయుల పాత్రను మెరుగుపరచడానికి ఉద్దేశించింది. అయితే వారిని భర్తీ చేయడానికి కాదంటున్నారు. ఏఐ పరిపాలనా పనులను ఆటోమేట్ చేయగలదు, వ్యక్తిగతీకరించిన అభ్యాస అనుభవాలను అందించగలదు.మానవ సంబంధాలను నిర్మించడానికి, మానసిక మద్దతును అందించడానికి, అర్థవంతమైన అభ్యాస అనుభవాలను సులభతరం చేయడానికి మానవులైన ఉపాధ్యాయులు ఇప్పటికీ చాలా అవసరం. వారి నేపథ్యం లేదా సామర్థ్యాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఏఐ సాధనాలు అందుబాటులో ఉంటాయి. విద్యలో ఏఐ అమలులో 'సమానత్వం' అనేది ఒక ముఖ్యమైన అంశంగా ఉండాలి. వ్యక్తిగతీకరించిన బోధన, తక్షణ అభిప్రాయం, లక్షిత జోక్యాలను అందించడం ద్వారా ఏఐ అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థుల ప్రత్యేక అవసరాలు, అభ్యాస శైలిలకు అనుగుణంగా అభ్యాస సామగ్రిని మార్చగలదు. అంతేకాకుండా అభ్యాసకుల గోప్యత, డేటా భద్రత కలిగి ఉంటాయి. విద్యార్థుల డేటాను రక్షించడానికి బలమైన గోప్యతా విధానాలు, భద్రతా చర్యలను కలిగి ఉండటం ఎంతో ముఖ్యం. ఈ ప్రశ్నలు, ఆందోళనలను పరిష్కరించడం ద్వారా, విద్యావేత్తలు విద్యలో ఏఐ అమలు గురించి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. విద్యలో ఏఐ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో అనేక ట్రెండ్స్‌ని అనుసరిస్తుంది. విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అభ్యాస సామగ్రిని, జోక్యాలను సర్దుబాటు చేయడంలో ఏఐ వ్యవస్థలు మరింత అధునాతనంగా మారతాయి. ఈ వ్యక్తిగతీకరించిన విధానం అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరుస్తుంది. ఏఐ –ఆధారిత చాట్‌బాట్‌లు, వర్చువల్ అసిస్టెంట్‌లు సహజ భాషను అర్థం చేసుకోవడంలో, ప్రతిస్పందించడంలో మరింత అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులకు తక్షణ మద్దతు, మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి. విద్యా డేటాను విశ్లేషించడంలో, విద్యావేత్తల కోసం కార్యాచరణ విధానాలను రూపొందించడంలో ఏఐ అల్గారిథమ్‌లు మెరుగుపడుతూనే ఉంటాయి. ఇది డేటా ఆధారిత నిర్ణయాధికారం, వ్యక్తిగతీకరించిన బోధనను సాధ్యం చేస్తుంది. ఏఐ సాంకేతికతలు అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీతో అనుసంధానించబడతాయి. ఈ ధోరణులు విద్యను మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మరింత ఆకర్షణీయమైన, సమర్థవంతమైన అభ్యాస వాతావరణాలను సృష్టిస్తాయి.విద్యలో ఏఐ అనేక ప్రయోజనాలను అందిస్తుంది. విద్యలో ఏఐని అమలు చేయడం అనేది నమ్మదగిన డేటా లభ్యత, ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం వంటి సవాళ్లతో కూడి ఉంటుంది. ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా, విద్యావేత్తలు తరగతి గదిలో ఏఐని విజయవంతంగా అనుసరించి ఫలితాలు సాధించవచ్చు. విద్యా రంగంలోఆన్‌లైన్ కోర్సుల రూపకల్పన, నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎన్నో అవకాశాలను కలిగిస్తోంది. విద్యావేత్తలను శ్రమతో కూడిన పనులనుండి విముక్తి చేస్తుంది. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, కంటెంట్ ఎల్లప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా ఉండేలా చూస్తుంది. పరిపాలనా పనులను ఇప్పుడు ఏఐ ఉపయోగించి ఆటోమేట్ చేయవచ్చు. దీనివల్ల అధ్యాపకులు తమ దృష్టిని పూర్తిగా విద్యార్థులపై కేంద్రీకరించడానికి అవకాశం ఉంటుంది. అంటే వారు విద్యార్థులకు మరింత సమయం కేటాయించవచ్చు. దీనివల్ల ఏ విద్యార్థి వెనుకబడిపోకుండా చూసుకోవచ్చు. విద్యార్థుల నేర్చుకునే విధానాలను విశ్లేషించడం ద్వారా, 'అడాప్టివ్ ఏఐ' టూల్స్ వారి ప్రత్యేక శైలికి అనుగుణంగా పాఠాలను అందిస్తాయి. టెక్స్ టు –స్పీచ్, విజువల్ రికగ్నిషన్, స్పీచ్ రికగ్నిషన్ వంటి ఏఐ సామర్థ్యాలను ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకోసం ప్రత్యేకంగా రూపొందించవచ్చు. వర్చువల్ ట్యూటర్స్ ప్రాధాన్యత మరింతగా పెరుగుతోంది. ఇవి చాట్‌బాట్‌లా కాకుండా వ్యక్తిగత గురువులా వ్యవహరిస్తాయి. అర్ధరాత్రి సందేహం వచ్చినా, టీచర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఏఐ ద్వారా వెంటనే వివరణ పొందవచ్చు. ప్రతి విద్యార్థి గ్రహణశక్తి ఒకేలా ఉండదు. ఏఐ దీనిని గుర్తించి.. పాఠం వినడంలో ఇబ్బంది పడుతుంటే, మరిన్ని ఉదాహరణలతో సులభంగా వివరిస్తుంది. పరీక్షా పత్రాల మూల్యాంకనం, హాజరు వంటి పరిపాలనా పనులను ఏఐ చూసుకుంటుంది. దీనివల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలు, సృజనాత్మకతను నేర్పడంపై ఎక్కువ సమయం కేటాయించగలరు. ఏ విద్యార్థి పరీక్షల్లో వెనుకబడే అవకాశం ఉందో ఏఐ డేటాద్వారా ముందే గుర్తించి ఉపాధ్యాయులను హెచ్చరిస్తుంది. ఏఐ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదు. వారి సామర్థ్యాలను పెంచడానికి మాత్రం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# చంద్రబాబు ముందుచూపు ఉన్న నేత..

- మొదటి పేజి తరువాయి

కలిసినప్పుడే ఆయన ఆలోచనల్లోని ముందుచూపును గ్రహించానని వెల్లడించారు. ఆ రోజుల్లో ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత సమీపంలో ఉండేవారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఈ స్థాయిలో వినియోగించడం లేదని, కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం గొప్ప పరిణామమని అభినందించారు. విపత్తుల నిర్వహణలో టెక్నాలజీతో ప్రాణనష్టం నివారించే వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రశంసించారు. చంద్రబాబు తనకు "గుడ్ ఓల్డ్ ఫ్రెండ్" అని బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

### 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా రాష్ట్రం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌పై బిల్ గేట్స్‌కు సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. 2047 నాటికి రాష్ట్రానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు. రాష్ట్ర జీఎస్డీపీని ప్రస్తుత 180 బిలియన్ డాలర్ల నుంచి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడం, తలసరి ఆదాయాన్ని 3,400 డాలర్ల నుంచి 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులను 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు వృద్ధి చేయడం వంటి లక్ష్యాలను పేర్కొన్నారు. అలాగే నిరుద్యోగాన్ని 2 శాతానికి తగ్గించడం, మహిళా కార్మికుల భాగస్వామ్యాన్ని 80 శాతానికి పెంచడం, సంపూర్ణ అక్షరాస్యత సాధించడం వంటివి తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు.

### విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం

రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 13.4 లక్షల మంది విద్యార్థుల కోసం ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నామని చెప్పారు. వ్యవసాయంలో ఏఐ ద్వారా రైతులకు సాగు సలహాలు అందించడం, డ్రోన్లు వంటి యంత్రాలను అద్దెకు అందుబాటులో ఉంచడం వంటి కార్యక్రమాలను వివరించారు. తెగుళ్లపై ముందస్తు హెచ్చరికలతో రైతులను నష్టాల నుంచి కాపాడుతున్నామని తెలిపారు. గోధార్ యాప్‌తో పశువుల ఆరోగ్య సంరక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### జూలై కల్లా రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

రాష్ట్ర వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుగా భావిస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా వివరించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని, ఇప్పటికే 2.9 లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 5.2 కోట్ల ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా జూలై 2026 నాటికి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ 'ఏఐ డాక్టర్' సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

### బిల్‌గేట్స్‌తో మంత్రుల ఇంటరాక్షన్

ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ పలు అంశాలపై బిల్ గేట్స్‌ను ప్రశ్నలు అడిగారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు ఆలోచనకు కారణమేంటని పయ్యావుల అడగ్గా... నాడు చంద్రబాబు ఐటీని ప్రోత్సహించడం వల్ల హైదరాబాద్‌కు చెందిన

టెక్ నిపుణులు తమ వద్ద ఎక్కువగా ఉండేవారని, వారి సూచన మేరకే అక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని బిల్ గేట్స్ వివరించారు. ఏఐ ద్వారా ఆరోగ్య సేవలను మారుమూల ప్రాంతాలకు కూడా సమర్థవంతంగా అందించవచ్చని మంత్రి సత్యకుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏఐ రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని, ఈ అంశంపై ఢిల్లీలో జరిగే సమ్మిట్‌లో చర్చిస్తామని ఆయన తెలిపారు.

# ఏఐ సమ్మిట్..భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం

- మొదటి పేజి తరువాయి

ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం.ఫిబ్రవరి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుంది. ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభోపన్యాసం చేస్తారు. సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ విజన్‌ను, ప్రపంచ దేశాల సహకారంపై ఆయన తన ప్రసంగంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, 60 మంది మంత్రులు, ఉప మంత్రులు పాల్గొంటున్నారు.ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న 'ఏఐ ఫర్ ఆల్', 'ఏఐ బై హర్', 'యువ ఏఐ' పేర్లతో మూడు గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఛాలెంజ్‌లకు 60 దేశాల నుంచి 4,650కి పైగా అప్లికేషన్లు రావడం, బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందనడానికి నిదర్శనంగా నిపుణులు పేర్కొంటున్నారు. వీటిలో ఫైనలిస్టులుగా ఎంపికైన 70 బృందాలు ఫిబ్రవరి 16, 17 తేదీల్లో భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్‌లలో తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి.ఇదే క్రమంలో, ఫిబ్రవరి 18న ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో 'ఏఐ, దాని ప్రభావం' అనే అంశంపై రీసెర్చ్ సింపోజియం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎస్టోనియా అధ్యక్షుడు అలర్ కారిస్ హాజరవుతున్నారు. ఈ సింపోజియంలో ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత ఏఐ మార్గదర్శకులు, పరిశోధనా సంస్థలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవడం జరుగుతుంది.

# కరీంనగర్ మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ..
# ఎన్నికను బహిష్కరించిన బీఆర్ఎస్

- మొదటి పేజి తరువాయి

66 స్థానాలు ఉండగా, బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, మజ్లిస్ 3 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఇతరులు 10 చోట్ల గెలుపొందారు. బీఆర్ఎస్, మజ్లిస్, స్వతంత్రులతో కలిపి కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది.కరీంనగర్ కార్పొరేషన్‌లో తమకు అధికారానికి కావాల్సిన స్థానాలు దక్కలేదు కాబట్టి తాము మేయర్ ఎన్నికను బహిష్కరించామని

బీఆర్ఎస్ కౌన్సిలర్లు వెల్లడించారు. తాము బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటించామని అన్నారు. తమకు మెజారిటీ స్థానాలు వస్తే తాము మేయర్ పదవి కోసం బరిలో నిలిచేవాళ్లమని వెల్లడించారు.

# ఢిల్లీలో ఏవియేషన్ సంస్థను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

లాంఛనంగా ప్రారంభించినట్లు తెలిపారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగానికి ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించడమే లక్ష్యంగా ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గతంలో తాను అమెరికాలోని అట్లాంటాలో పర్యటించినప్పుడు ఈ ఏవియేషన్ సర్వీసెస్ సంస్థ ఏర్పాటు ఆలోచన వచ్చిందని, అది ఇప్పుడు కార్యరూపం దాల్చిందని లోకేశ్ వివరించారు. దేశ ఏవియేషన్ రంగం ఎదుగుదలకు అవసరమైన ప్రతిభావంతులను అందించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ ప్రారంభోత్సవం అనంతరం, ఢిల్లీ విమానాశ్రయం నేపథ్యంలో యువ పైలట్ క్యాడెట్లతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్నట్లు లోకేశ్ తెలిపారు. యువ క్యాడెట్లతో ముచ్చటించడం

భారత విమానయాన రంగ భవిష్యత్తుకు అద్దం పట్టిందని, వారితో సంభాషణ అద్భుతమైన అనుభూతినిచ్చిందని ఆయన తన సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కొత్త సంస్థ ద్వారా దేశ విమానయాన రంగానికి మరింత ఊతం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

- మొదటి పేజి తరువాయి

పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. పోలీసుల తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# చంద్రబాబుతో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు... జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు

- మొదటి పేజి తరువాయి

ఒక పోస్ట్ పెట్టారు.ఒక ఫొటోలో వైసీపీ అధినేత జగన్ తన ఇంటి నుంచి బయటకు వస్తుండగా, పలువురు వైసీపీ నేతలు గేటు బయట వేచి ఉన్న దృశ్యాన్ని మంత్రి పంచుకున్నారు. మరో ఫొటోలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో పాటు తాను, ఇతర మంత్రులు కలిసి ఉన్న చిత్రాన్ని జతచేశారు. ఈ రెండు చిత్రాలను పోలుస్తూ ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు.సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు మంత్రి పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ, భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు.ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడంలో చంద్రబాబు చేస్తున్న కృషిని బిల్ గేట్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కీలక సమావేశం జరిగిన నేపథ్యంలోనే మంత్రి పార్థసారథి చేసిన పోస్ట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

# మహిళలకు మరోసారి భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్

- మొదటి పేజి తరువాయి

కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీ–జేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు.ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### చైనా సరిహద్దు ప్రాంతంలో కేంద్రమంత్రి
# కిరణ్ రిజిజు పర్యటన

- మొదటి పేజి తరువాయి

విషయం తెలిసిందే. ఇలాంటి తరుణంలో చైనా సరిహద్దుకు దగ్గరలోని తన నియోజకవర్గం అరుణాచల్ వెస్ట్‌లో కేంద్రమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, పార్లమెంటు సజావుగా సాగడంపై రాహుల్ గాంధీకి ఆసక్తి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని కొన్ని ఎన్జీవోలు ఆయనకు చెప్పాయని, అందుకే పదేపదే సభను అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశ భద్రత విషయంలో రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు.

ప్రచురితం కాని పుస్తకం గురించి చెప్పడానికి ఏముంటుందని కిరణ్ రిజిజు అన్నారు. ఆ పుస్తకం గురించి మనం మాట్లాడుకోకూడదని అన్నారు. అయితే రాహుల్ గాంధీ మాట్లాడింది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి తీవ్రంగా పరిగణించాలని అన్నారు. అలాంటి అంశాలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి సరిహద్దుల గురించి ఏమీ తెలియదని, అందుకే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. సరిహద్దుల గురించి ఆయన తెలుసుకుంటే మంచిదని సూచించారు.

# బిల్ గేట్స్‌తో మళ్లీ సమావేశం కావడంపై సీఎం చంద్రబాబు స్పందన

**1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిశానని వెల్లడి**

**అప్పుడు ఐటీ విజన్.. ఇప్పుడు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంపై చర్చించామని వివరణ**

**అమరావతి సచివాలయంలో నా విజన్‌ను ఆయనకు వివరించానన్న చంద్రబాబు**

**ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తామని ఉద్ఘాటన**




మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత దాతృత్వవేత్త బిల్ గేట్స్ సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొని, రాష్ట్ర ప్రాధాన్యతా రంగాలపై బిల్ గేట్స్‌కు వివరించారు.ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 1997లో తాను తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి ఐటీ రంగానికి సంబంధించిన తన విజన్‌ను పంచుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "1997లో నేను తొలిసారి మిస్టర్ బిల్ గేట్స్‌ను కలిశాను. అప్పుడు ఆయనకు నా ఐటీ విజన్‌ను వివరించాను. ఆ రోజు ఒక టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంపై మా మధ్య మొదలైన సంభాషణ, ఇప్పుడు ఒక విస్తృత లక్ష్యంగా రూపాంతరం చెందింది. వినూత్న ఆవిష్కరణలను ఉపయోగించి పాలనలో మార్పులు తీసుకురావడం, ప్రజల జీవితాలను పెద్ద ఎత్తున మెరుగుపరచడమే ఆ లక్ష్యం.ఈ రోజు అమరావతి సచివాలయంలో ఆయనతో మరోసారి భేటీ అయ్యాను. ఈ సందర్భంగా, నా స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆయన ముందు ఉంచాను. ఈ సమావేశంలో మా మంత్రులు, కార్యదర్శులు కూడా పాలుపంచుకుని ఆయనతో సంభాషించారు.మా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించాం. రాష్ట్ర ప్రజలకు సాధికారత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏయే మార్గాల్లో పనిచేయవచ్చో అన్వేషించాం. ఆనాటి మా సంభాషణ నేటి మా విస్తృత లక్ష్యాలకు పునాది వేయడం సంతోషంగా ఉంది" అని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# రేపు జంబుపట్నం గ్రామంలో చాగంటి వారి ప్రవచనాలు..



**భక్తులందరికీ ఇదే ఆహ్వానం అడపా సురేష్..**

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 16:** బుధవారం సాయంత్రం ఐదు గంటలకు జంబుపట్నం గ్రామంలో శ్రీ ఉమా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు పెన్ పవర్ ప్రతినిధికి అడపా సురేష్ తెలియజేశారు. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలకు ఆలయ ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేశామని కోరుకొండ మండల చుట్టుపక్కల ప్రజలు భక్తులు వినేందుకు వీలుగా ఉంటుందని అడపా సురేష్ తెలిపారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి



భీమవరం గునుపూడి పంచారామ క్షేత్రం మహాశివరాత్రి శ్రీ సోమేశ్వర స్వామి వారి లింగోద్భావకాల అలంకరణ దర్శనం

# ఘనంగా శివపార్వతుల కళ్యాణం



- అంగరంగ వైభవంగా
- రంప లో మహాశివరాత్రి వేడుకలు

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం పరిధిలో గల రంప గ్రామంలో ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం లో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా ఆదివారం రాత్రి నిర్వహించారు .12వ శతాబ్దంలో చోళుల కాలంలో నాగవంశీయులచే ప్రతిష్ఠించబడిన ఈ ప్రాచీన శివాలయంలో సన్నాయి మేళ తాళాల నడుమ, వేద మంత్రోచ్చారణలతో కళ్యాణ మహా క్రతువు ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ప్రసన్నకుమార్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కళ్యాణ కార్యక్రమానికి స్టేట్ ఎస్.టి. కమిటీ చైర్మన్ సోళ్ళబొజ్జి రెడ్డి సతీసమేతంగా హాజరై పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు.సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. సన్యాసి నాయుడు సతీసమేతంగా హాజరయ్యారు. వరుడు తరఫున రాజవంశ వారసులు, వధువు తరఫున స్థానిక వ్యాపార సంస్థల యజమానులు కళ్యాణ కర్మలో భాగస్వాములయ్యారు.

అధిక సంఖ్యలో స్థానిక భక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమరతసేవా ఫౌండేషన్, ధర్మ ప్రచార భక్త మండలి కోఆర్డినేటర్నల్లమిల్లి వేంకటరామారెడ్డి, విశ్వ హిందూ పరిషత్ (వి.హెచ్.పి), వనవాసి కళ్యాణ ఆశ్రమ తదితర సంస్థల కార్యవర్గ సభ్యులు హాజరై సేవలు అందించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శివపార్వతుల దివ్య కళ్యాణాన్ని దర్శించిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.



రంప శివాలయంలో శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి కి లింగోద్భవ కాలంలో నిర్వహించిన అభిషేకం అనంతరం అలంకరణ

## ఆలపాటి నాగేశ్వరరావు మృతికి ఉంగుటూరు మానవత సంతాపం



**పెన్ పవర్, ఉంగుటూరు ఫిబ్రవరి 16**

ఉంగుటూరు: గోదావరి ఉమ్మడి జిల్లాలో పలు సేవా సంస్థలతో అనుబంధం కలిగి, మానవతా సేవా కార్యక్రమాలకు మార్గదర్శకులుగా నిలిచిన మానవత జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అకాల మరణం పట్ల ఉంగుటూరు మానవత నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

మానవత సేవను తన ఇంటిపేరుగా మార్చుకొని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన నాగేశ్వరరావు గారి లేని లోటు సంస్థకు తీరనిదని మానవత రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మన్ సాగిరాజు జానకీ రామరాజు అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజ సేవలో ఆయన చూపిన నిబద్ధత, సేవా తపన అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, అధ్యక్షులు కోనే వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ, మానవతా కార్యక్రమాల విస్తరణలో నాగేశ్వరరావు గారి పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో మానవత సీనియర్ నాయకులు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, అడపా శ్రీనివాస్, గుణ్ణం బులెబ్బాయ్, శీతాల సత్యనారాయణ, పుసులూరి ప్రకాష్, పాతూరి వంశీ, బొమ్మిడి అప్పారావు, గురివెల్లి రాజారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి, తాతారావు, సూర్యనారాయణ రాజు, సతీష్, గంగాధర్, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొని నాగేశ్వరరావు గారికి ఘన నివాళులు అర్పించారు.

## మై టిడిపి యాప్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ..

తెదేపా జిల్లా అధ్యక్షులు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి..



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ బలోపేతం మరియు డిజిటల్ వ్యవస్థ బలపర్చే దిశగా మై టీడీపి యాప్ వాల్ పోస్టర్ ను రూడా చైర్మన్ తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి టిడిపి కార్యకర్త మై టిడిపి యాప్ ఉపయోగించాలని ప్రతిరోజు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ప్రతి కార్యకర్త పాల్గొనాలని నాయకులకు కార్యకర్తలకు యాప్ గురించి ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంటే కేసర రావు, మార్ని రాము, దూది కాంతారావు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవినీతి తిమింగలం..

## ఆగని అవినీతి



### రైతుల పై కాసుల భారం

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి16:**ప్రజల కష్టార్జితంతో నెల నెల జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులలో కొందరు ఇంకా చాలా వున్నట్టు లంచాల కోసం ప్రజలను జలగల్లా పీడిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే సీతానగరం మండలంలోని మండల అధికారి సంబంధిత గ్రామస్థాయి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు సహకారంతో ఉపాధి హామీలో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయిందని ఈ వ్యవహారంలో కొందరిని అడ్డుపెట్టుకుని ఫీల్డ్ అసిస్టెంట్లపై పెనుభారం మోపుతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసిన ఈఅవినీతి తిమింగలాలపై చర్యలు ఉన్నట్టా లేనట్టా అన్నట్లుగా తయారైంది. పలువురు రైతులనుంచి అధికారులు కాసులు ఇవ్వాలంటూ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కొమ్ము కాస్తూ కొందరి ఫీల్డ్ అసిస్టెంట్లను ఇబ్బంది పెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అని ఉపాధి హామీ కూలీల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## తిరుమల లడ్డు కల్తీ పై ప్రభుత్వం ఆసత్య ప్రచారం తో హిందువుల మనోభావాలను దెబ్బతీయడం సరి కాదు

మీడియా సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**తిరుమల లడ్డు కల్తీ పై ప్రభుత్వం నిరంతరం ఆసత్య ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీయడం సరి కాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ అన్నారు. స్థానిక బొమ్మూరు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంపై హైకోర్టు నియమించిన సిట్ నివేదిక ప్రకారం అందులో జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టమైన నివేదిక ఇచ్చిందన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వ నేతలు సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ , మంత్రులు ,ఇతర నేతలు లడ్డు లో జంతువుల కొవ్వు కల్తీ జరిగిందని అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా అసత్య ప్రసారాన్ని మానాలని, లేదంటే ఆ దేవదేవుడి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పట్టిసీమ శ్రీ భద్రకాళి వీరేశ్వరస్వామి వారి సేవలో జగదీశ్వరి విజయ్ దంపతులు.



**పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16.**

నియోజకవర్గంలోని పట్టిసీమ వద్ద అఖండ గోదావరి మధ్యలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారిని రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి, టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ నాయక్ లు సోమవారం దర్శించుకున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధమైన శైవ క్షేత్రాల్లో పట్టిసీమఒకటి. ఇక్కడ స్వయంభుగా వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏటా మూడు రోజులు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మ వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. అత్యంత ప్రాచీనమైన, ప్రసిద్ధమైన ఈ ఆలయాన్ని జగదీశ్వరి విజయ్ నాయక దంపతులు సందర్శించి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ వేదమంత్రాలతో ఈ దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జగదీశ్వరి విజయ్ దంపతులు మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం దినదిన అభివృద్ధి చెందాలని ప్రజలు సంతోషాలు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆది దేవతలైన శ్రీ భద్రకాళి వీరేశ్వర స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. వారి వెంట పట్టిసీమ గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, కృష్ణ, హరి, నరేష్, చౌదరి, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" లో 24 ఫిర్యాదులు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 24 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.



# నగరంలో శాశ్వత మంచినీటి సరఫరాకు సమగ్ర కార్యాచరణ



- అమృత్ 2.0లో రూ. 135 కోట్లు మంజూరు
- ఏఐ సాంకేతికత , రద్దీ నియంత్రణ లో
- ట్రైల్ రన్ విజయవంతం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఫిబ్రవరి 16:** నగరానికి శాశ్వత మంచినీటి పథకాల అమలకు, స్వచ్ఛమైన మంచినీటి సరఫరా కు సమగ్ర కార్యాచరణ చేపట్టామని, అమృత్ పథకం 2.0 లో రూ.135 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెషన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని రానున్న పుష్కరాల నేపథ్యంలో చేపట్టిన ఏఐ టెక్నాలజీ, క్రౌడ్ మేనేజ్మెంట్ వ్యవస్థలు మంచి ఫలితాలు ఇచ్చాయని, వీటిని ట్రైల్ రన్ గా చేపట్టామన్నారు. మహాశివరాత్రి కి భక్తుల గోదావరి స్నానాలు చేసి, ఆయా దేవాలయాల్లో ఇబ్బంది లేకుండా స్వామివారి దర్శనం చేసుకున్నారన్నారు. మొట్టమొదటి ఏఐ కెమెరాలు, చైల్డ్ ట్యాగింగ్ టెక్నాలజీతో ఘాట్ రద్దీని రియల్ టైమ్ మానిటర్ చేసి, పిల్లల ట్రేసింగ్ చేయడం జరిగిందని వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో రూ. 250 కోట్లు (సీఎస్ఆర్, ఎంపీ నిధులు, ఇతర నిధులు) నిధులతో నగరంలో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇప్పుడు వచ్చిన రూ.135 కోట్ల ?తో పనులు చేస్తామన్నారు.

నగరంలో దశాబ్దాల తాగునీటి కొరత సమస్యలకు కొత్త పణాళికతో శాశ్వత పరిష్కారం చూపిస్టామన్నారు. లా హాస్పిన్ వద్ద ఇంటేక్ వెల్, కొటిలింగలపేట ఫిల్టరేషన్ ప్లాంట్, ఈఎల్ఆర్ఎస్ ట్యాంకులు నిర్మాణం, కొటిలింగలపేట, సారంగధర మెట్ట, వెంకటేశ్వరనగర్లో రిజర్వాయర్ల నిర్మాణం చేస్తామన్నారు. ఖేలో ఇండియా పథకంలో సుమారు రూ. 14 కోట్లతో నగరంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నామన్నారు. రానున్న మూడేళ్లలో పూర్తవుతుందన్నారు.

**వైఎస్సార్సీపీపై తీవ్ర విమర్శలు :**

సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపునకు నడిపిస్తుంటే వైకాపా అడ్డుకోవాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు. అసెంబ్లీ బడ్జెట్ సభ మర్యాదలు మరచి, గవర్నర్ ముందు పేపర్లు చింపి విసరడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ స్ఫూర్తి ని అపహాస్యం చేసినట్టేనన్నారు. ప్రతిపక్షం బలహీనత, సింగిల్ లీడర్ డామినేషన్ (పెద్దిరెడ్డి, బొత్సాలను ఉ ద్దేశించి) వైకాపాలో బాగా కనిపిస్తోందన్నారు.

రానున్న మూడేళ్లలో రూ.1000 కోట్ల పనులు... రివర్ బ్యాంక్ నుంచి ప్రతి వీధిలోను వెలుగులు నింపడం, గత పాలకులు నాశనం చేసిన రాజమండ్రిని అభివృద్ధి నగరంగా మారుస్తామన్నారు. "

ప్రజల జీవితాల్లో మార్పు వచ్చేలా బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా, వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీ రాజ్, మహిళ సంక్షేమం రంగాలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. ఎస్టీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మీడియా సమావేశంలో కూటమి నాయకులు కుడుపూడి సత్తిబాబు, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు, కంటిపూడి శ్రీను, కొయ్యల రమణ, శెట్టి జగదీష్, బుడ్డిగ రవి, తవ్వ రాజా, తంగెళ్ళ బాబీ, ఉప్పులూరి జానకిరామయ్య, కంటిపూడి రాజేంద్రప్రసాద్, బుడ్డిగ గోపాలకృష్ణ, కడలి రామకృష్ణ, ద్వారా పార్వతి సుందరి, జవ్వాది మురళి, అగురు ధన్ రాజ్, బేసరి చిన్ని, దాస్యం ప్రసాద్, దుత్తరపు గంగాధర్, సలాది ఆనంద్, చింతపల్లి నాని, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ, రాజేష్ కన్నా, చొప్పర్ల వీరభద్రరావు, వింజరాపు శంకర్, రత్న రెడ్డి, కానేటి ప్రభు, కానేటి కృప, మదినా సాహెబ్ పాల్గొన్నారు.

# రూరల్ శాసనసభ్యులు గోరంట్ల కు రైతులు అభినందనలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి వారి కార్యాలయం నందు సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.

అసెంబ్లీ సమావేశాలలో గోరంట్ల నియోజకవర్గంలోని మడికి నుండి దుళ్ళ మీదగా మండపేట మండలం ఏడిద వరకు సాగునీరు పంట కాలువలపై ఆక్రమణలు తొలగించి రైతులకు న్యాయం చేయాలని ప్రస్తావించారు . ఈ సందర్భంగా కొంతమంది రైతులు ఎమ్మెల్యే గోరంట్లను కలిసి అభినందనలు తెలిపారు.

# హిందూత్వాన్ని వక్రీకరించడం లో ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కుట్ర



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**బ్రిటిష్ వారికి ఊడిగం చేసిన ఆర్ ఎస్ ఎస్ హిందూ ఉగ్రవాదం ను ప్రోత్సహిస్తుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ విమర్శించారు.

(అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో

హిందూత్వాన్ని వక్రీకరించి మాట్లాడుతున్న ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్ దేశ ప్రజల కు క్షమాపణ చెప్పాలన్నారు. శతాధ్ధి కాలం గా హిందూ ధర్మ రక్షకులుగా ముసుగు ధరించి హిందూ ధర్మాన్ని , భక్తులను మోసం చేస్తూన్నారన్నారు. హిందూ వ్యతిరేకతత్వం మోహన్ భగవత్ నోటి నుండి వచ్చిందన్నారు . మోహన్ భగవత్ పవిత్ర హిందూ పదంపై విషం కక్కిన ఘటనను ఆర్ ఎస్ ఎస్, వాటి అనుబంధ సంస్థలు ఖండించక పోవటాన్ని బట్టి వీరు హిందూ రక్షకులు కాదని హిందూ సమాజానికి అర్థం అవుతుందని ఆయన పేర్కొన్నారు ..

మోహన్ భగవత్ చేసిన ప్రకటన కారణంగా కొంతమంది మత ఉన్మాద శక్తులు మత ఘర్షణలు పెరగటానికి కారణం కావొచ్చన్నారు . ఆర్ ఎస్ ఎస్ వక్రబుద్ధి దేశంలో హిందూ ధర్మానికి, భద్రతకు పెను ప్రమాదంగా మరే పరిస్థితులు వున్నాయని , ఆర్ ఎస్ ఎస్ ను పూర్తిగా నిషేధించి మత సామరస్యానికి తోడ్పాటుగా నిలవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హిందూ , ముస్లిమ్స్ మధ్య చిచ్చు పెట్టి మత కలహాలకు ఆజ్యం పోసి న గత చరిత్ర ఆర్ ఎస్ ఎస్ కు ఉందన్నారు. భారతదేశం లౌకిక దేశం మత పరమైన దేశం కాదని, దేశంలో ప్రతి హిందువు ఒక సెక్యులర్ అని మరవకండన్నారు. ఆర్ ఎస్ ఎస్ బ్రిటిష్ వారి కి ఊడిగం చేసి ఎందరో భారతీయ ఉద్యమ యోధుల మరణాలకు కారకులయ్యా దన్నారు. వీరు స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర లేదన్నారు . నాడు బ్రిటిష్ వారికోసం సేవలు చేసిన ఆర్ ఎస్ ఎస్ దేశ భక్తులుగా ప్రచారం చేసుకోవటం దెయ్యాలు వేదాలు చెబుతూట్టున్నట్టుగా ఉందన్నారు. మరో గోద్ర వంటి అల్లర్లుకు ఆర్ ఎస్ ఎస్ పథక రచన చేస్తుందనే భయాలు భారతీయులను వెంటాడుతున్నాయని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆవేదన వ్యక్త పరిచారు .ఈ సభకు అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , సిమ్మా దుర్గారావు , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , దుడ్డే త్రినాద్ , వాడపల్లి జ్యోతిష్ , గుడ్ల దుర్గా ప్రసాద్, వల్లి శ్రీనివాసరావు, యర్రా బాల మురళి కృష్ణ , బసా సోనియా , మేకల కిరణ్ కళ్యాణ్ , చల్లా సాంబశివరావు , మాసా అప్పాయమ్మ , చల్లా వంశీ , ఎస్ కే బాబీ తదితరులు పాల్గొనియున్నారు ..

# జిల్లా స్పోర్ట్స్ వార్షిక క్యాలెండర్ విడుదల చేసిన జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా వార్షిక క్రీడా క్యాలెండర్2026ను సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆవిష్కరించారు. జిల్లాలో క్రీడలను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విస్తరించేందుకు, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఈ క్యాలెండర్ ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.జిల్లాలో ఫిబ్రవరి నెలలో చదరంగం, సైక్లింగ్ పోటీలు, మార్చిలో మాస్టర్స్ అథ్లెటిక్స్, మాస్టర్స్ బ్యాడ్మింటన్, మాస్టర్స్ టెన్నిస్ పోటీలు నిర్వహించబడతాయి. ఏప్రిల్‌లో వాటర్ స్పోర్ట్స్, లాన్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. మే నెలలో ఫుట్‌బాల్, బీచ్ వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్ పోటీలు, జూన్‌లో వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తారు.జూలై , ఆగస్టు నెలల్లో అమరావతి ఛాంపియన్‌షిప్ ఎన్ఎస్డి2026 పోటీలు మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించబడతాయి. సెప్టెంబరులో వాలీబాల్, జిమ్నాస్టిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు, అక్టోబరులో జూడో, హాకీ, బీచ్ ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయి. నవంబరులో ఖో–ఖో, కబడ్డీ, రైఫిల్ షూటింగ్, పారా అథ్లెటిక్స్, పారా స్విమ్మింగ్, పారా రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. డిసెంబరులో బీచ్ హ్యాండ్‌బాల్, బీచ్ కబడ్డీ, బీచ్ సపక్తాక్రావ్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించబడతాయి.

జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా సాధికారిక అధికారి డి.ఎం.ఎం. శేషగిరి, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసు దేవరావు, యోగా శిక్షకులు నాగబాబు లు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధి బడ్జెట్ పై హర్షం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి 16 ;** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆశయాలను ప్రతిబింబించేదిగా ఉందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం జీలుగుమిల్లిలో గడ్డమణుగు గార్డెన్స్ జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కోయ లగూడెం మండల అధ్యక్షులు తోట రవి, నాయకులు నూకల శ్రీనివాస్ ,శివకుమార్, వంశీ, శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఫిబ్రవరి 16 ;** జీలుగుమిల్లిలో వేంచేసియున్న శ్రీ జగదాంబ అమ్మవారి 69వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో పోస్టర్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుండి ఆరు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి అన్నారు. పలు సంస్కృత కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, జగదాంబ అమ్మవారి ఉత్సవాల ఆలయ కమిటీ చైర్మన్ సిరి వెంకటేశ్వరరావు, సిరి కృష్ణయ్య, వార శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# గౌతమి జీవకారుణ్య సంఘంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సందర్శన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్. శ్రీలక్ష్మి సోమవారం గౌతమి జీవకారుణ్య సంఘంను సందర్శించి, వృద్దుల యోగక్షేమాలు, వసతులను పరిశీలించారు.

వృద్ధులకు అల్పాహార , భోజన సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హెల్ప్‌లైన్ నంబర్ 15100ను సంప్రదించవలని శ్రీలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహంను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగుల గురించి తెలుసుకున్నారు. క్రమశిక్షణ, సహనశీలత వంటి లక్షణాలను అలవరుచుకొని మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. పర్యవేక్షణ గృహంలో సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని తెలిపారు.

ఈ సందర్శన లో జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి వెంట గౌతమి జీవకారుణ్య సంఘం ప్రతినిధి, ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో ఇళ్ళ పురోగతి ని పరిశీలించిన హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**రాజమహేంద్రవరం పరిధిలో పిఎంఏవై 2.0 పథకం క్రింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ, లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాన్ని త్వరిగతిగా పూర్తి చేయడానికి పీఎం అవాస్ యోజన పథకం కింద 2.50 లక్షల రూపాయలు యూనిట్ విలువను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వెలుగుబంద లే అవుట్ లో ఇళ్ళ స్థలాల కేటాయింపులు జరిగిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కొమ్ముగూడెం సొసైటీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అబ్బిన వీర వెంకట్రావు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 16.** తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొమ్ముగూడెం సొసైటీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ నాయకులు అబ్బిన వీర వెంకట్రావు ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మర్యాదపూర్వకంగా బొలిశెట్టి శ్రీనివాస్ ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు బాధ్యత గా నిర్వహిస్తాను అబ్బిన వీర వెంకట్రావు అన్నారు

## అన్ని వర్గాల ప్రజలకు బడ్జెట్ లో న్యాయం జరిగింది :ఎమ్మెల్యే బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 16:** అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ను రూపొందించారని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర బడ్జెట్ గురించి ఆయన మాట్లాడారు. రైతులకు అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. శాసన సభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, ప్రజల సంక్షేమానికి భరోసా ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు జరిగిన కేటాయింపులను వివరించారు. ప్రధానంగా 2026-27 ఆర్ధిక సంవత్సరానికి సంబంధించి ఏపి శాసనసభలో 3లక్షల, 32వేల, 205 కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. దీనిలో భాగంగానే శాఖల వారీగా చేసిన కేటాయింపులను ఆయన వివరించారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తిచేయటం,తల్లికి వందనం తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించారన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు బడ్జెట్లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్య, వైద్య రంగాలకు భారీగా నిధులు కేటాయించారని అన్నారు. మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు. ఇవేమి పట్టని వైసిపి నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి విమర్శలను ప్రజలే తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కోరారు. నిరంతరం ప్రజల మేలుకోరే కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలబడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, అడపా ప్రసాద్, పుల్లా బాబి, కొడవటి ఈశ్వర్, చాపల రమేష్, కట్టు బోయిన వెంకటలక్ష్మి, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు, రామ్ లక్ష్మణ్, మద్దిపాటి ధర్మేంద్ర, పైబోయిన వెంకటరామయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు

## వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కొట్టు నాగు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 16.** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న పెంటపాడు గ్రామపంచాయతీ 11 వ వార్డు మెంబర్, వైసీపీ సీనియర్ నాయకులు, మారంపూడి ఏసుదాసు ను ఆయన గృహంలో కొట్టు నాగు సోమవారం పరామర్శించారు.

ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, మీకు ఏ అవసరం వచ్చిన తనను నేరుగా కలవాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. వైసీపీ పార్టీ మీకు కొండంత అండగా ఉంటుందని ఆయన తెలిపారు. తనను కలవడానికి ఫోన్ చేయొచ్చని లేదా నేరుగా కలవచ్చని ఆయన తెలిపారు. రానున్న రోజులలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసి తాడేపల్లిగూడెంలో వైసిపి జెండా ఎగుర వేయాలని ఆయన కోరారు. ఆయన వెంట వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిలు కట్టా నాగరాజు, ఉదయ భాస్కర్, కొమ్ముగూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు వెలిశెట్టి నరేంద్ర, వైసిపి జిల్లా యువజన జనరల్ సెక్రటరీ గంద్రోజు సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఆరిమిల్లి రవి సభ్యులు గోపి,రాజు, శివ చదలవాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహాకాళేశ్వర స్వామి ఆలయం లో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పూజలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:** స్థానిక గోదావరి నదీ తీరాన గౌతమి ఘాట్ వద్ద ఉన్న మహాకాళేశ్వర స్వామి వారిని ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి దర్శనం చేసుకొని, పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఉజ్జయినిలో వలే ఇక్కడ మహాకాళేశ్వర స్వామి వారికి భస్మాభిషేకం జరగడం ఆలయం ప్రత్యేకత ను కొనియాడారు.

బ్రాండ్ పేరు లేకుండా, రిటైల్ విక్రయానికి ప్యాక్ చేయని ముడి పొగాకుపై ఎక్సైజ్ డ్యూటీ పన్ను లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయంపై పొగాకు రైతులు ఆమె కలిసి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. రాజమండ్రి త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ.135 కోట్లు కేటాయించడం సంతోషించదగ్గ విషయమని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలియజేసారు.

## నులిపురుగుల నివారణ మాత్రలు పిల్లలకు తప్పనిసరిగా వేయాలి-డా.హారిక గుప్త




**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 16:** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు(అల్బెండజోల్) పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఎస్.హారిక గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుండి 19 ఏళ్ల వయస్సు గల పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్య కేంద్ర పరిధిలోని వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మొత్తం 6210 మంది పిల్లలకు ఈ మాత్రలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. 1-2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 2-19 ఏళ్ల పిల్లలకు ఒక పూర్తి మాత్ర వేయాలని అన్నారు.

పిల్లలు ఈ మాత్రను తప్పనిసరిగా నమిలి మింగాలని,

నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల తగ్గుతుందని చెప్పారు. కనుక ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు భాగస్వాములై, పిల్లలందరూ మాత్రలు వేసుకునేలా చూడాలని డాక్టర్ హారిక గుప్త కోరారు. ఏదైనా కారణం చేత 17వ తేదీన మాత్ర వేసుకోలేకపోయిన పిల్లల కోసం ఈ నెల 24న 'మాప్-అప్ డే' నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు విజయవంతం చేయాలని వైద్యాధికారి ఆదేశించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జక్కంపూడిరాజా ను కలిసిన గూడెం చెందిన పార్టీ లో వివిధ హోదాలో నియమించిన నాయకులు.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 16.** సోమవారం వైస్సార్సీపీ రాష్ట్ర యువజన అధ్యక్షులు జక్కంపూడి రాజా ను విజయవాడలో తాడేపల్లిగూడెం గూడెం చెందిన పార్టీ లో వివిధ హోదాలో నియమించిన నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు..

రానున్న రోజుల్లో పార్టీ ని బలోపేతం చేసి జగనన్న ని సీఎం చేసేవరకు కష్టపడి పనిచేస్తామని తెలిపారు..కృతజ్ఞతలు తెలిపిన వారిలో కొత్తగా నియమించిన రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి కట్టా నాగరాజు, కార్యదర్శి భాస్కర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అరిమిల్లి రవి, కార్యదర్శి, సురేష్, సభ్యులు, రమణ,గోపి, సురేష్ నాగేంద్ర, రాజు పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 16:** రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం తూర్పుగోదావరి జిల్లాలోని తాళ్లపూడి మండల గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయరులు అందరూ కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేయడం జరిగినది. తాళ్ళపూడి తహసిల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం లంచ్ సమయంలో సమయపాలన, పని ఒత్తిడి ప్రయారిటీ లేని పనులు వన్ బై వన్ కాకుండా రకరకాల పనులు టైంతో సంబంధం లేకుండా పై అధికారులు చెప్పడం వలన విఆర్వోలను తీవ్ర ఒత్తిడికి గురి చేయటం జరుగుతుందని నిరసనకారులు తెలిపారు. ఇదే విషయం గతంలో సీసీఎల్ వారికి, ప్రభుత్వానికి చెప్పడం జరిగిందని అన్నారు. దానిపై ఏ విధమైన చర్య తీసుకోలేదని, దానికి నిరసనగా ఫిబ్రవరి 19 వరకు ప్రతిరోజు మధ్యాహ్నం నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలియజేయడమైనది. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పని వర్క్ రూల్ అమలు చేయుచున్నామని చెప్పారు.

## రేఖపల్లి ప్రభుత్వవైద్యశాల సిబ్బంది.తోసమావేశం



వైద్యశాల డాక్టర్,నీలుఫర్,వైద్యశాలసిబ్బంది.

వి.ఆర్.పురం పెన్.పవర్.పిబ్రవరి.16

మండలంలోనిరేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవద్ద సోమవారం ప్రభుత్వవైద్యశాల డాక్టర్,నీలుఫర్,ఆధ్వర్యం లోనేషనల్ డివార్మింగ్ డే,పై ప్రభుత్వవైద్యశాల సిబ్బంది. తోసమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈసందర్భంగాప్రభుత్వవైద్యశాల డాక్టర్,నీలుఫర్,మాట్లాడుతూ మం డలంలోని రేపుజరగబోవు జాతీయ నులిపురుగుల కార్య క్రమాన్ని వందశాతం విజయవంతంగా పూర్తి చేయాలని, కోరారు.24వ. తారీకునకూడా నులిపురుగుల కార్యక్రమం జరుగును.ఈ అవకాశాన్ని మండలప్రజలు సద్వినియోగం చేసుకోవాలని,కోరారు.బాలబాలికలకు 1సంవత్సరం నుం డి 2సంవత్స రాలు వరుకు సగంటాబ్లెట్,గుండంచేసి అం టే పొడిచేసి పోయాలి.2 సంవత్సరాలునుండి 5సంవత్స రాలు వారికీ పూర్తి టాబ్లెట్,వీరికి కూడా టాబ్లెట్,ను పొడి చేసి నీరు ద్వారాత్రాగించాలి.6సంవత్సరాల వయస్సు నుండి19 సంవత్సరాలు వరుకు వారికీ పూర్తి టాబ్లెట్,ను నోటిలో పెట్టి సప్పరించాలి.తరువాత నమిలి మింగాలని, సూసించారు.ఈకార్యక్రమంలోపి.హెచ్.ఎన్.భద్ర కాళి,హెచ్.ఎ.లు నివాస్,రత్తయ్య,సతీష్,సత్తి,ఎ.ఎన్.ఎం.లు చంద్ర మ్మ, లక్ష్మి,పార్వతి,మహేశ్వరి,సి.హెచ్.ఒ.లు పవన్,మంగ, అనూష,ఆశలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 16.** మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే ఈలి నానిని పరామర్శించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అనంతరం ఈలి వరలక్ష్మి మన మధ్య లేకపోవడంతో చాలా బాధాకరం అన్నారు.

ఈ కార్యక్రమంలో పసల చంటి వాడపల్లి వెంకట సుబ్బరాజు బాబీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే ఈలి నానిని పరామర్శించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అనంతరం ఈలి వరలక్ష్మి మన మధ్య లేకపోవడంతో చాలా బాధాకరం అన్నారు.ఈ కార్యక్రమంలో పసల చంటి వాడపల్లి వెంకట సుబ్బరాజు బాబీ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయము నందు, శివరాత్రి సందర్భంగా 90వ త్రిమూరర్తి శవ జయంతి మహోత్సవములు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 16:** నిన్న శివరాత్రిని పురస్కరించుకొని సాయంత్రం స్థానిక తాడేపల్లిగూడెం ప్రజా పిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయము నందు, శివరాత్రి సందర్భంగా 90వ త్రిమూరర్తి శవ జయంతి మహోత్సవములు రమాదేవి అక్కయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ శ్రీ డాక్టర్ కృష్ణ చరణ్ నంద భారతి స్వామి వారు శ్రీ యాజ్ఞవ ల్క్ యరాజా శ్రమ పీఠాధిపతులు శివతత్వాన్ని బోధించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు &ప్రభుత్వ విప్ బొలిశెట్టి నివాస్ , విశిష్ట అతిధులుగా తాడేపల్లిగూడెం భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్& మాజీ మున్సిపల్ చైర్మన్ ఈతకోట భీమశంకరరావు (తాతాజీ), భోగేశ్వరరావు(టీబీ ఆర్) పాల్గొన్నారు మరియు మాకా శ్రీనివాస్ , రామగాని సత్యనారాయణ, పట్టణ ప్రజలు పూలతో విశిష్ట అలంకరణ చేసిన ఆ మహాశివలింగాన్ని దర్శించుకున్నా రు.

# పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం






**ఎంఈఓ 2 మల్లేశ్వరరావు**

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం కీలకమని దాతల సహకారంతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించవచ్చని మండల విద్యాశాఖ అధికారి 2 మల్లేశ్వరరావు అన్నారు.విద్యాంజలి 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిడతమామిడి ఎంపీపీ స్కూల్ అభివృద్ధికి దాత బి. జయబాబు ముందుకొచ్చారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు గురవయ్య అధ్యక్షతన నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం కు ఎంఈఓ 2 మల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి దాతలు ముందుకు రావాలని, దాతల సేవలు అభినందనీయమని ఆయన అన్నారు. దాత జయ బాబు పాఠశాల ఆకర్షణీయంగా కనిపించేలా స్వంత ఖర్చులతో పెయింటింగ్ పనులు చేయించారు. విద్యార్థుల చదువుకు తోడ్పడేలా తెలుగు, ఇంగ్లీష్, హిందీ రైటింగ్ పుస్తకాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్. వేసవి దృష్ట్యా ప్రతి విద్యార్థికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.

అదేవిధంగా, కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రతిరోజు సాయంత్రం వాలంటరీ నియమించి ఈవినింగ్ క్లాసులు నిర్వహించనున్నట్లు దాత బి. జయబాబు తెలిపారు. విద్యార్థులు మంచి స్థాయికి ఎదగాలని తన వంతు చిన్న ప్రయత్నం చేస్తున్నానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, పిల్లలను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గురవయ్య, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఆవిష్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహణ



**పెన్ పవర్, ఉంగుటూరు ఫిబ్రవరి 16**ఉంగుటూరు మండలం నారాయణపురంలోని రాతీఱ ాాబతీశీఎఱఅఅసశీ జవత్వఖుతీఎ ణవస్త్రతీవవ జశీశ్రీశ్రీవస్త్రవలో సోమవారం భౌతిక శాస్త్రం మరియు లైఫ్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. రెడ్డియ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర అధ్యాపకులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, ప్రాచీన కాలం నుంచి ప్రస్తుత ఆధునిక యుగం వరకు ప్రపంచవ్యాప్తంగా జరిగిన ముఖ్య ఆవిష్కరణల గురించి వివరించారు. ఇన్నోవేషన్ సమాజ అభివృద్ధికి కీలక శక్తి అని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం ద్వారా కొత్త అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు.అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి తన జీవితంలో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల ద్వారా అభివృద్ధి సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డి. రెడ్డియ్య మాట్లాడుతూ, సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్యార్థులే ముందుండాలని, చదువుకునే వయసులోనే వినూత్న ఆలోచనలను అలవర్చుకుని భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణల ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బోటనీ విభాగానికి చెందిన షేక్ ఆయేషా, నిర్మలా జ్యోతి మేడం, పి. బాబు రావు తదితర అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# ఎస్సీ/ ఎస్టీ గృహాలకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన వెలుగులు





- ఎస్సీ, ఎస్టీ గృహాలకు నూరు శాతం సబ్సిడీతో సోలార్ ప్యానల్స్ అమరిక
- ఒక్కొక్క కుటుంబానికి నూరు శాతం ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లింపు రూ.1.20 లక్షలు కాగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.60 వేలు.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పథకం అమలుకు ఏప్రిల్ 13, 2026 ఉంది
- ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు నూరు శాతం రాయితో పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానల్స్ అమరిక పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**తాడేపల్లిగూడెం పెన్ పవర్. ఫిబ్రవరి 16.** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల గృహాలలో విద్యుత్ వెలుగులు నింపేందుకు పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద ఉచితంగా సోలార్ ప్యానల్స్ అమరికకు సంకల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

ఎస్పీ ఎస్పీ వర్గాల గృహాలకు పీఎం సూర్య ఘర్ పథకం కింద నూరు శాతం సబ్సిడీతో అమలు చేస్తున్న సోలార్ ప్యానల్స్ అమరిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలో మొట్టమొదటిగా తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, దీనిలో భాగంగా పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా మరొక సంక్షేమాన్ని నూరు శాతం సబ్సిడీతో అందించడానికి రాష్ట్రవ్యాప్తంగా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో మొట్టమొదటిగా నేడు నీలాద్రిపురంలో ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మన ముఖ్యమంత్రికి టెక్నాలజీ అంటే చాలా ఇష్టము అని, టెక్నాలజీ గ్రామాలకు కూడా అందించే లక్ష్యంతో ఈ విధంగా సోలార్ ప్యానల్స్ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు అందరికీ చేరవేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ఒకటిన్నర సంవత్సరంగా జిల్లాలో ఉన్న కుటుంబాలకి సబ్సిడీపై సోలార్ ఎనర్జీని పియం సూర్య ఘర్ ద్వారా ప్రతి ఇంటికి సబ్సిడీతో ప్యానల్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నా అన్నారు. వారు వినియోగించుకున్న విద్యుత్ పోను గ్రిడ్ కు అందించిన దానికి మిగిలిన మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేయడం కూడా జరుగుతుందన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో మన జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 5 వేల గృహాలకు మాత్రమే కనెక్షన్లను ఇవ్వడం జరిగింది అన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు నూరు శాతం సబ్సిడీపై ఈ ప్రాజెక్ట్ అమలులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో తొలి విడతలో సుమారు 22,855 ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు రూ. 260.18 కోట్ల రూపాయలు విలువ కలిగిన 2 కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ అమర్చడం జరుగుతుందని తెలిపారు. 60 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ద్వారా సబ్సిడీ అందిస్తున్నదని, మిగిలిన మొత్తం ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వడం జరుగుతుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 8,403 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాల లబ్ధిదారులను గుర్తించడం జరిగిందని, వీరిలో తొలి విడతగా 3,273 కుటుంబాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 6,546 కుటుంబాలకు దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.

తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎంత పని చేసినా అధికారులు దాన్ని అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని, నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ సహకారం ఎంతో విలువైనదని కొనియాడారు. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు రూ. 1.80 లక్షల విలువైన సోలార్ ప్యానల్స్ ను నూరు శాతం సబ్సిడీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు కరెంట్ ను కొనుక్కోకుండా సోలార్ ప్యానల్స్ ఉచితంగా అందించడంతో ఉచిత విద్యుత్తును పొందగలుగుతారు అన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఎస్సీ, ఎస్టీ సోదరులు పట్ల ఉన్నటువంటి అభిమానాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సోదరులకు ఉన్నటువంటి విదేశీ అంబేద్కర్ విద్యను, ఎస్సీ,ఎస్టీ సబ్సిడీ లోన్స్ అందించకపోయిన నేడు కూటమి ప్రభుత్వం అందించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ, మిమ్మల్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచనతో ఒక్కొక్క లబ్ధిదారులకు రూ. 1.20 ఖర్చుచేసి ఈ పథకాన్ని అమలు చేయడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. అలాగే బడ్జెట్ కేటాయింపుల్లో కూడా బడుగు బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ఆర్డిఓ ఖతిబ్ కౌసర్ భానో, ట్రైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకాశం స్వామి, తహసిల్దార్ రాజరాజేశ్వరి, సర్పంచ్ లక్ష్మణరావు, జడ్పిటిసి ఆంజనేయులు, ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ శేషు లత, కూటమి నాయకులు ఈతకోట తాతాజీ, అడప ప్రసాద్, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, కొడవటి ఈశ్వర్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పసల, వాడపల్లి సుబ్బరాజు, పేతినగిరి, రామ లక్ష్మణ్, కొండ, పాలూరి వెంకటేశ్వరరావు, మద్దిపాటి ధర్మేంద్ర,కే రామారావు, తదితర స్థానిక నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## జనసేన పార్టీ ఉంగుటూరు మండల అధ్యక్షుడు రాజీనామా



**పెన్ పవర్ ఉంగుటూరు ఫిబ్రవరి 16**జనసేన పార్టీ ఉంగుటూరు మండల కమిటీ అధ్యక్షుడు పంది రాంబాబు తన పదవికి మరియు పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావుకు పోస్టు ద్వారా పంపినట్లు రాంబాబు తెలిపారు. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, కిందిస్థాయి నాయకులకు గుర్తింపు లభించడం లేదని, అలాగే స్థానిక ఎమ్మెల్యే తనను పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసినప్పటికీ తన సేవలను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యాచరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని ఆయన తెలిపారు.ఈ రాజీనామా స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి. సువర్ణ రాజు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 16.** జనసేన పార్టీ అభివృద్ధికి జనసైనికులు వీర మహిళలు కృషి చేయాలని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల మండలాలకు చెందిన జనసైనికులు సోమవారం సువర్ణ రాజును పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు పార్టీ స్థితిగతులపై కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు నాయకులతో మాట్లాడారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ అధినేత మంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తీసుకుంటున్న ప్రజాసంక్షేమ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్లవలసిన బాధ్యత ప్రతి జనసైనికుడి పై ఉందన్నారు. నాయకులు స్థానికంగా ఉండి ప్రజలలో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించవలసిన బాధ్యత ఉందన్నారు. పార్టీ ప్రతిష్టకు ఐక్యంగా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు కంబాల సత్తిబాబు, సీనియర్ నాయకులు చప్పటి శివ, దాసరి శేషారావు, నల్లజర్ల మండల పార్టీ కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, చీపురు గూడెం గ్రామ కమిటీ అధ్యక్షులు గుండా బత్తుల వరుణ్ కుమార్, తలంశెట్టి శ్రీనివాస్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ-డా.పి.అన్నపూర్ణ



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు(అల్బెండజోల్) పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ పి.అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుండి 19 ఏళ్ల వయస్సు గల పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మొత్తం 3,520 మంది పిల్లలకు ఈ మాత్రలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. 1–2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 2–19 ఏళ్ల పిల్లలకు ఒక పూర్తి మాత్ర వేయాలని సూచించారు.

పిల్లలు ఈ మాత్రను తప్పనిసరిగా నమిలి మింగాలని చెప్పారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల తగ్గుతుందని, కనుక ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు భాగస్వాములై, పిల్లలందరూ మాత్రలు వేసుకునేలా చూడాలని డాక్టర్ అన్నపూర్ణ కోరారు. ఏదైనా కారణం చేత 17వ తేదీన మాత్ర వేసుకోలేకపోయిన పిల్లల కోసం ఈ నెల 24న 'మాప్–అప్ డే' నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు విజయవంతం చేయాలని వైద్యాధికారి ఆదేశించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఘనంగా రథోత్సవం





**టి నరసాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 16 :**చినకాశీగా పిలవబడే టి నరసాపురం అన్నపూర్ణా విశాలాక్షి సమేత కాశి విశ్వేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం,లింగోద్భవం కార్యక్రమము ఆలయ కమిటి చైర్మెన్ అనుమోలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కల్యాణం అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సోమవారం రథోత్సవంగా నగర వీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి 30వ కళ్యాణ మహోత్సవం కమిటి సభ్యులు , భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు.రథోత్సవంలో మహిళలు ముఖ్యంగా ఆర్యవైశ్య మహిళలు పాల్గొనడం విశేషం.కల్యాణం అనంతరం మంగళవారం ఆలయ ప్రాంగణం వద్ద అఖండ అన్న సమారాధన కార్యక్రమం కలదని భక్తులు ఈ అన్న సమారాధన కార్యక్రమంలో దాదాపు 20వేల మందికి పైగా పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలిపారు.కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.ఉత్సవాలకు సహకరించిన ఆలయ అన్నదాన కమిటీ సభ్యులు పసుమర్తి రాము, పర్వతనేని మురళి, సాయి సూర్య రాంబాబులతో పాటు ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొన్న అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ర్యాలి గౌడ వీధిలో వీరభద్రుల సంబరం ఘనంగా





**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి16:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని గౌడ వీధిలో సోమవారం వీరభద్రుల సంబరం భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి వీరభద్ర స్వామిని స్మరించారు. "వీరభద్రుడు సర్వ సర్వ" అంటూ నినాదాలు చేస్తూ భక్తులు వైయిర్ కావువ వద్ద ఉన్న జమ్మి చెట్టు వరకు పొర్లు దండాలు పెట్టారు.

కొంతమంది భక్తులు తలపై విభూది కొండలు మోసుకుంటూ గ్రామ వీధుల్లో ఊరేగారు. భక్తి ఉత్సాహంతో సాగిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గౌడ వీధి మొత్తం ఆధ్యాత్మిక
వాతావరణంతో మార్మోగింది.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేపట్టి భక్తులకు తాగునీరు, ప్రసాదం వంటివి అందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానికులు జాగ్రత్తలు తీసుకున్నారు. గ్రామంలో వీరభద్రుల సంబరం ప్రతీ ఏటా ఇదే విధంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని భక్తులు తెలిపారు.

# నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు





**అత్తిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**ఫిబ్రవరి 17న నిర్వహించనున్న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాతృశిశు అభివృద్ధి ఆరోగ్య విభాగం స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శిరీష, ఆర్‌బీఎస్‌కే & ఎన్‌సీడీసీడీ విభాగానికి చెందిన డా. కిషోర్ అత్తిలి ప్రాంతంలోని బాలుర హాస్టల్ మరియు బాలికల పాఠశాలను సందర్శించారు.సందర్శనలో భాగంగా ఆంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి తరగతి గదిలో నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించే వీడియోలు ప్రదర్శించాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనానికి ముందు మరియు మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు.అలాగే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనం వండే వారు, వడ్డించే వారు పరిశుభ్రత పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, గోర్లు కత్తిరించుకోవడం, తాగునీటిని శుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తల ద్వారా నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని వివరించారు.పిల్లల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచడం ద్వారా నులిపురుగుల సమస్యను పూర్తిగా నిర్మూలించవచ్చని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ సురేఖ, పాఠశాల సిబ్బంది, ఆంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రాజ్యసభ మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయి కన్నుమూత.

ప్రముఖుల నివాళులు..
నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి ఏజెన్సీ లో తిరుగులేని నేతగా పేరొందిన రత్నబాయి..
అభిమానులు , నాయకులు , కార్యకర్తలు , కుటుంబ సభ్యులు మధ్య ముగిసిన అంత్యక్రియలు..





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 16:** కాంగ్రెస్ పార్టీ ని ఏజెన్సీ లో నాలుగు దశాబ్దాల పాటు తిరుగులేని నేతగా నిలబెట్టిన రాజ్యసభ మాజీ సభ్యురాలు తడపట్ల రత్నాబాయి ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు.

కాంగ్రెస్ పార్టీ కి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన శైలి లో చెరగని ముద్ర వేసిన సీనియర్ నేత, రాజ్యసభ మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయి (79) కన్ను మూయడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు. కొంత కాలంగా వయోభారంతో రాజకీయాలకు దూరమైన కార్యకర్తలు కు , నాయకులు కు అందుబాటులో ఉంటూనే ఉన్నారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ స్థానికంగా వివాహది శుభాకార్య క్రమాలకు హాజరు అయ్యేవారు. ఆదివారం రాత్రి ఒక్కసారి గా ఆమె తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు తక్షణమే రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు... అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె భర్త సత్య నారాయణ కూడ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పీసీసీ సభ్యులు గానూ పనిచేసారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

**రత్నబాయి రాజకీయ ప్రస్థానం :**

ఉపాధ్యాయురాలు గా తన ప్రస్థానం ప్రారంభించిన రత్నబాయి తర్వాత కాలం లో రాజకీయ ఆర గ్రేట్రం చేసి గిరిజన ప్రాంతం నుంచి ఉవ్వెత్తున ఎగిసిన అలలా నాలుగు దశాబ్దాల పాటు గిరిజన ప్రజల గొంతుకగా నిలిచారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ , వ్యాపార ప్రముఖులు , ఆదివాసీ నాయకులునివాళులు అర్పించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

రత్నాబాయి రాజకీయ ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. 1972లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎల్లవరం (ప్రస్తుతం రంపచోడవరం) నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందడం ద్వారా ఆమె తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి రాజ శేఖర్ రెడ్డి హయం లో 2006 లో గిరిజన సహకార సంస్థ కు చైర్మన్ గా పని చేశారు. 2008 లో రాజ్యసభ సభ్యురాలిగా పార్లమెంటులో అడుగుపెట్టారు. అనంతరం 2014 నుండి 2020 వరకు శాసనమండలి సభ్యురాలిగా సేవలందించి గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడిన రత్నబాయి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీగా మూడు వేర్వేరు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించిన అరుదైన గౌరవం పొందారు. వైస్సార్సీపీ ఆవిర్భావము తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు తో కాంగ్రెస్ పార్టీ ని వీడటం ఇష్టం లేని ఆమె తన తుది శ్వాస విడిచే వరకు కాంగ్రెస్ పార్టీలో నే కొనసాగారు.

**కంచు కోట బద్దలు :** తన హయాంలో నే టీడీపీ కి కంచుకోట గా ఉన్న రంపచోడవరం నియోజకవర్గం లో మొదటి సారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని కోసూరి సత్య నారాయణ రెడ్డి 2009 గెలిపించి అసెంబ్లీలో కూర్చోపెట్టి అధిష్టానం కి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

**రంపచోడవరం లో అంత్యక్రియలు :**

రత్నబాయి మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే లు సీతం శెట్టి వెంకటేశ్వరావు , చిన్నం బాబూ రమేష్ , వంతల రాజేశ్వరి , మాజీ ఎంపీ హర్ష కుమార్ , ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత నాటి ఆమె అనుచరులు సర్పంచ్ మంగా బొజ్జయ్య , బాలాజీ శ్రీను , కిరణ్ , చాకలి నాగేశ్వరావు , బాల కృష్ణ , సింహాద్రి , ఉలవల లక్ష్మి , కారుకోడి పూజ , వైస్సార్సీపీ నాయకులు పండా సిద్దార్ధ దొర , భారత ఆదివాసీ పార్టీ నాయకులు మద్దెటి అంజిరెడ్డి తదితరులు ఆమె భౌతిక కాయం పై పుష్ప గుచ్చలు ఉంచి నివాళులు అర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆమె స్వగృహం నుండి భారీ ఊరేగింపు గా బయలు దేరిన ఆమె అంతిమ యాత్ర లో అభిమానులు , నాయకులు , కార్యకర్తలు , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పారిశుధ్యాన్ని పక్కన పెట్టి.. పన్నుల వసూళ్ల కు పరుగోపరుగు !



**ఏలూరు ఫిబ్రవరి 12 పెన్‌పవర్ :** సంవత్సరాల తరబడి ఇంటి పన్నులు,కుళాయి పన్నులు వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన పంచాయితీ డెవలప్ మెంట్ అధికారులు గ్రామంలో పేరకుపోయిన ఇంటి పన్నులు,కుళాయి పన్నుల బకాయిలు వసూలు చేయడం కోసం పరుగులు పెడుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామ పంచాయితీల ఆర్థిక పరిపుష్టిని పెంచేందుకు చర్యలు చేపట్టింది.దీనిలో భాగంగా స్వర్ణ పంచాయితీ యాప్ ను అందుబాటులోకి తెచ్చి ఇంటి పన్నులు కుళాయి పన్నులు పక్కదారి పట్టకుండా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.ఇంటి పన్నులు,కుళాయి పన్నులు మాన్యువల్ విధానానికి స్వస్తి పలికేవిధంగా డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టి అక్రమాలకు చెక్ పెట్టే విధంగా విధానం రపోందించింది.దీంతో ఏళ్ల తరబడి గ్రామ పంచాయితీలో పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు ఇటు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి,పంచాయితీ రాజ్ కమీషనర్ పన్నుల వసూళ్లకు ఫిబ్రవరి 10వ తేదీ నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని గడువు విధించింది.ఏలూరు జిల్లా భీమడోలు మండలం ఆగడాల లంక, చెట్టున్నపాడు, సూరప్పగూడెం, కోరుకొల్లు,పూళ్ల,కూరెళ్లగూడెం, పంచాయితీలలో ఇంటి పన్నులు,కుళాయి పన్నుల వసూళ్లలో ఆగడాల లంక,చెట్టున్నపాడు, సూరప్పగూడెం.గ్రామాలలో ఉన్న అసెస్‌మెంట్‌లలో 30-50 శాతానికి మించి వసూళ్ల ప్రక్రియ నిర్దేశిత లక్ష్యానికి చేరువకాని పరిస్దితి నెలకొంది.పన్నుల వసూళ్లకై పరుగులు పెడుతున్న సచివాలయాల సిబ్బంది,గ్రామంలోని పారిశుధ్యం,తాగునీటి సరఫరా వంటి కార్యకలాపాలను పక్కన పెట్టి,ప్రజారోగ్యం ఏమైపోతే మాకేంటి అన్న చందంగా దైనందిన కార్యక్రమాలను గాలికి వదిలేశారు.దీంతో ఆగడాల లంక,
చెట్టున్నపాడు, గ్రామాలలోపారిశుధ్యం క్షీణించి దోమలు వాప్తి చెంది.డ్రైనేజీలలో మురుగు కదలక దోమలు విజృంభించి గ్రామాల్లో అనారోగ్యకర వాతావరణం ఏర్పడింది.పన్నుల వసూళ్ల ప్రక్రియలో భాగంగా గ్రామాలలో ఆనారోగ్య పరిస్దితులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ప్రజానీకానికి అండగా ఎమ్మెల్యే వెంకట్రాజు ఉండగా.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 16.** నియోజకవర్గంలోని ప్రజానీకానికి తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం ఆయన నల్లజర్ల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మమేకమై గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ తాను నిరంతరం ప్రజలతోనే ఉంటానని వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటానన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి తాను ఎప్పుడు సిద్ధంగానే ఉంటాను అన్నారు. ప్రజలు తమ సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయా గ్రామాల్లో పర్యటించినప్పుడు పలువురు ఎంతో ఆప్యాయత, ప్రేమాభిమానాలు చూపించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు.

# మూడు ప్రాంతాల్లో 3 ఎకనామిక్ రీజియన్స్

**విజయవాడ, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. బడ్జెట్ లో తాజాగా కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించి, అన్ని జిల్లాల్లో సమాన వృద్ధిని సాధించడమే ఈ భారీ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో.. విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలు కోసం ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చేందుకు, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రాంతీయ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించిందని చెప్పారు. నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కి ఎకనమిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేశామని చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారువిశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఏడు గ్రోత్ ఇంజిన్లు ఉన్నాయి. వీటిలో మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయంలో 41పైగా ఇంపాక్ట్ ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని చెప్పారు. వాటికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల నుంచి సమకూర్చుకుంటామని పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అంతేకాదు.. మెట్రో రైల్ ప్రాజెక్టులు సహా వీఈఆర్ కి సంబంధించి సుమారు 28వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పిస్తున్నామని చెప్పారు.వీఈఆర్ తరహాలోనే అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఈ రీజియన్ పరిధిలోకి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, ర

పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలు రానున్నాయి. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి

దోహదం చేసే వనరులు.. గ్రోత్ ఇంజిన్లు, బలాల్ని గుర్తించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో సామాజిక, ఆర్థిక అధ్యయనం నిర్వహిస్తున్నా మని బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ తెలిపారు.వీఈఆర్, అమరావతి ఎకనామిక్

రీజియన్ అభివృద్ధి తరహాలో.. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ను ప్రభుత్వం సిద్ధం చేసింది. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని 303 మండలాల్లో 200పైగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్స్ గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సైలెంట్ మోడ్ లోకి కొట్టు సత్యనారాయణ

**ఏలూరు, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చ జరుగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట.ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్ళాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో..ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే..తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమంటూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు.కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తారో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టీవ్ అవుతారా? లేక తనదారి తన చూసుకుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలమాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# ఎన్నికలకు రెడీ అవుతున్న ఈసీ

**విజయవాడ,, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటినుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పోరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

# ఎమ్మెల్యేలకు సీఎం స్వీట్ వార్నింగ్

**విజయవాడ, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** సెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ లో పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు చంద్రబాబు. పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. మారకపోతే మీకే నష్టం అని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్ లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నా అని చెప్పారు. 95-96 మాదిరిగానే ఈసారి నిక్కచ్చిగా ఉంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. మొత్తం 9 పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నా అని తెలిపారు. వారికి తెలియని ఇంకొన్ని పేరా మీటర్లు కూడా తన దగ్గర ఉన్నాయన్నారుసిఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. వైసీపీ విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని, ఇబ్బందులు అధిగమించిన ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో సమస్యలు అయితే మాత్రం ఇంకా చాలా ఉన్నాయి.. ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్రం సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాం.. వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలని ఆకాంక్షించారు.సేవా రంగంలోనూ ఆదాయం మరింత పెరగాలి.. ఒంగోలు పాలకు, అనంతపురం పండుకు ఎంతో డిమాండ్ ఉందని తెలిపారు. ఈ రెండింటి రుచి మరెక్కడా రాదు.. రెండు మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. అప్పటికి పూర్తిగా గాడిలో పడతాం.. రెండు మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని పేర్కొన్నారు. అమరావతి రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ వల్ల యాక్సిస్ మరింత పెరుగుతుందన్నారు



సిఎం.రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే.. హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు కేటాయించడం బాగుందని తెలిపారు. రాయలసీమలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికేది కాదన్న ఆయన.. పశుగ్రాసం, నీళ్లను రైళ్లలో తరలించిన సందర్భాలు ఉన్నాయన్నారు. 2014 19 మధ్య కూడా రైన్ గన్స్ తో పంటలు కాపాడే పరిస్థితి ఉండేది..అప్పుడే హంద్రీనీవాను సీరియస్గా తీసుకున్నామని, దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయి.. రాయలసీమలో పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు.ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్లో ఇచ్చే నివేదిక వారి పని తీరుకు నిలువుటద్దమని తెలిపారు. నేను గతంలో ఉన్నట్లే నిక్కచ్చిగానే ఉంటా.. మారకపోతే వాళ్లకే నష్టమని హెచ్చరించారు. మొత్తం తొమ్మిది పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నానని.. వారికి తెలియని ఇంకొన్ని పేరా మీటర్లు కూడా నావద్ద ఉన్నాయన్నారు. లోకేష్ తన పని తాను చేస్తున్నాడు.. నా పని నేను చేస్తున్నా అని.. నేతలతో మానవీయ సంబంధం, మోటివేషన్ భయం భక్తిలా ఉండాలంటూ చెప్పుకొచ్చారు.

# వల్లభనేని వంశీకి షాక్



**విజయవాడ, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రాజకీయ భవిష్యత్తు విషయంలో ఇప్పుడు ఆసక్తి నెలకొంది. 2019లో పార్టీ మారిన ఆయన.. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ విషయంలో అనుసరించిన వైఖరి ఇప్పుడు ఆయనకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది అనే మాట వాస్తవం. ఇక ప్రస్తుతం వైసీపీలో ఉన్న వల్లభనేని వంశీ మోహన్.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానికి సంబంధించి స్పష్టత రావటం లేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిన వంశీ, మళ్లీ వెనక్కు తగ్గినట్లుగానే కనబడుతోంది.అయితే గ్రామాల్లో ఆయనకు కొంత ఫాలోయింగ్ ఉండటంతో, వంశీ ప్రజల్లోకి వెళ్లాలని ఆ పార్టీ అధిష్టానం కూడా కోరుతున్నప్పటికీ వంశీ దూకుడు ప్రదర్శించడం లేదు. కేసులు భయం కారణంగా వంశీ వెనక్కు తగ్గుతున్నట్లుగా స్పష్టంగా అర్థం అవుతుంది. వచ్చే ఎన్నికల నాటికి గన్నవరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలి అంటే.. కచ్చితంగా వంశీ ప్రజల్లోకి రావాలని, ఆ పార్టీ కార్యకర్తలు కూడా కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం కూడా వంశీ పై ఉంది.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే పై వచ్చే ఆరోపణల విషయంలో, కూడా వంశీ కాస్త దూకుడు ప్రదర్శించాలని

ఆ పార్టీ నాయకత్వం కోరుతోంది.

అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వంశీ బయటకు రావడానికి ఇష్టపడటం లేదు. దీనితో గన్నవరం నియోజకవర్గంలో, ఇన్చార్జిను మార్చాలనే ఆలోచనలో కూడా పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయిలో కసరత్తు కూడా చేశారని, అయితే ఒకరిద్దరి నేతలు అధినేత వైఎస్ జగన్ వద్ద నియోజకవర్గ పరిస్థితిని ప్రస్తావించడంతోనే వెనక్కు తగ్గినట్లుగా తెలుస్తోంది.వంశీ అరెస్టు విషయంలో గ్రామాల్లో కొంత సానుభూతి ఉంది అనే ప్రచారం కూడా ఉంది. దీనిని వంశీ వాడుకునే ప్రయత్నం కొంత చేసినప్పటికీ ఆ తర్వాత పరిస్థితులు సహకరించకపోవడంతో మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఇక నియోజకవర్గంలో నాయకత్వాన్ని మారిస్తే, భవిష్యత్తులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధిష్టానానికి ఇప్పటికే కొంతమంది చెప్పినట్లుగా వైసిపి వర్గాలు అంటున్నాయి. అందుకే వంశీ విషయంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉందని సమాచారం.

# పోటీ చేయాలంటున్న కేడర్...

**నెల్లూరు, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్ మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందిప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా

# మనిషివా.. మిషన్‌వా.. బ్రో!

## టీ20 క్రికెట్ చరిత్రలో రషీద్ ఖాన్ సరికొత్త రికార్డ్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ సరికొత్త చరిత్ర సృష్టించారు. టీ20 ఫార్మాట్లో 700 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అరుదైన ఘనత సాధించాడు. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా యూఏఈతో జరిగిన మ్యాచులో ఈ రేర్ ఫీట్ నెలకొల్పాడు. అఫ్గాన్ తరఫున 191 వికెట్లు, మిగిలిన 509 వికెట్లు ఐపీఎల్ వంటి లీగ్‌లలో సాధించాడు. రషీద్ ఖాన్ తర్వాత టీ20 ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో వెస్టిండీస్ దిగ్గజాలు బ్రావో (631), నరైన్ (613లి) ఉన్నారు. ఒకే ఫార్మాట్‌లో 700 వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించిన రషీద్ ఖాన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు క్రికెట్ ఫ్యాన్స్. మనిషివా.. మిషన్‌వా.. బ్రో అంటూ ఫన్నీగా అభినందిస్తున్నారు. ఇక మ్యా విషయానికి వస్తే.. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా సోమవారం (ఫిబ్రవరి 16) ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచులో యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ ఘన విజయం సాధించింది. ఆల్ రౌండ్ షోతో యూఏఈను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 రన్స్ చేసింది. అనంతరం 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఆఫ్ఘనిస్తాన్ లక్ష్యాన్ని ఛేధించింది. 4 వికెట్లు, 40 పరుగులతో ఆల్ రౌండ్ షో చేసిన అజ్మాతుల్లా ఒమర్జాయ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు.

## వ్యూస్‌లో సరికొత్త రికార్డు సృష్టించిన ఇండియా - పాకిస్థాన్ మ్యాచ్

- పాకిస్థాన్ పై 61 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్
- డిజిటల్ వేదికపై రికార్డులు క్రియేట్ చేసిన మ్యాచ్
- జియో హాట్ స్టార్ లో మ్యాచ్ ను వీక్షించిన 45.4 కోట్ల మంది



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కేవలం ఇండియాలో మాత్రమే కాకుండా ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ లోని బలోచిస్థాన్ లలో కూడా సంబరాలు జరిగాయి. మరోవైపు, ఈ మ్యాచ్ డిజిటల్ వేదికలపై కూడా రికార్డులు క్రియేట్ చేసింది. జియో హాట్‌స్టార్ యాప్, వెబ్ సైట్‌లో ఈ మ్యాచ్‌ను 45.4 కోట్ల మంది వీక్షించారు. ఇది టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక వ్యూయర్‌షిప్. అంతకుముందు ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగిన మ్యాచ్‌కు 26 కోట్లు, నమీబియాతో మ్యాచ్‌కు 24 కోట్ల వ్యూస్ వచ్చాయి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ టీవీల ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులు ఈ దాయాదుల పోరును లైవ్‌లో చూశారు. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో గ్రూప్–ఏ మ్యాచ్‌లో భారత్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేశాడు. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ 18 ఓవర్లలోనే 114 పరుగులకు ఆలౌట్ అయింది. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి బౌలర్లు పాక్ బ్యాటర్లను కట్టడి చేశారు. దీంతో, భారత్ 61 పరుగుల భారీ తేడాతో భారీ విజయం సాధించింది.

## టాస్ దగ్గరే పాకిస్థాన్ ఓడిపోయిందన్న టీమిండియా స్పిన్ దిగ్గజం

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడమే పాక్ ఓటమికి కారణమన్న అశ్విన్
ఒత్తిడిని ఎదుర్కోవడంలో భారత్ 100 రెట్లు మెరుగ్గా ఉందని వెల్లడి
పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా వ్యూహాత్మక తప్పిదాలు చేశాడని విమర్శలు
ఇషాన్ కిషన్ ఎదుట షహీన్ అఫ్రిదిని ప్రయోగించడం పెద్ద తప్పు అని విశ్లేషణ

**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం సాధించడంపై టీమిండియా మాజీ స్పిన్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ తన విశ్లేషణను పంచుకున్నాడు. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, టాస్ గెలిచిన పాకిస్థాన్ బౌలింగ్ ఎంచుకోవడమే వారి ఓటమిని నిర్ణయించిందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఛేజింగ్ చేయాలన్న నిర్ణయం దారుణంగా బెడిసికొట్టిందని అన్నాడు. తన యూట్యూబ్ ఛానెల్ 'యష్ కీ బాత్'లో మాట్లాడుతూ... ఈ టోర్నీలో ఛేజింగ్ కష్టంగా ఉన్న పిచ్‌పై పాక్ ఫీల్డింగ్ ఎంచుకోవడం వ్యూహాత్మక తప్పిదమని తెలిపాడు. "ప్రేమదాస స్టేడియంలో చివరి 10 ఓవర్లలో 100 పరుగులు చేయడం అసాధ్యం. ఒత్తిడిని ఎదుర్కొనే విషయంలో భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్ 100 రెట్లు వెనుకబడి ఉంది. నిజాయతీగా చెప్పాలంటే వాళ్లు ఆ స్థాయిలో లేరు" అని అశ్విన్ పేర్కొన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా బౌలర్లను ఉపయోగించిన తీరును కూడా అశ్విన్ ప్రశ్నించాడు. ముఖ్యంగా, లెఫ్ట్ ఆర్మ్ సీమర్ల బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ ప్రమాదకరమని తెలిసినా... షహీన్ అఫ్రిదితో బౌలింగ్ చేయించడాన్ని తప్పుబట్టాడు. "డేటా నిజం చెబుతుంది. షహీన్ దెబ్బలు తింటున్నా, అతడితోనే బౌలింగ్ కొనసాగించడం పెద్ద తప్పిదం. కనీసం రౌండ్ ది వికెట్ వచ్చి బౌలింగ్ చేయాల్సింది. రెండో ఓవర్ సయీమ్ అయూబ్‌కు ఇచ్చి ఉండాల్సింది" అని అశ్విన్ వివరించాడు. ఆట చివర్లోనూ పాకిస్థాన్ పట్టు సాధించలేకపోయిందని అశ్విన్ విమర్శించాడు. డెత్ ఓవర్లలో మళ్లీ షహీన్ అఫ్రిదిని తీసుకురావడంతో, భారత బ్యాటర్లు సులభంగా పరుగులు సాధించారని గుర్తుచేశాడు. "భారత్ స్కోరు 19 ఓవర్లకు 159గా ఉంది. ఆ సమయంలో బౌలింగ్‌కు వచ్చిన అఫ్రిది చివరి ఓవర్లో 16 పరుగులు ఇచ్చాడు" అని తెలిపారు. లీగ్ దశలో తమ చివరి మ్యాచ్‌ను భారత్ బుధవారం అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్ అనంతరం సూపర్ 8 దశకు సన్నద్ధం కానుంది.



# హనుకి ప్రభాస్ డెడ్ లైన్..నిజమెంత?







ఇండియన్ సూపర్ స్టార్లలో అత్యంత బిజీగా ఉన్న స్టార్ హీరో ప్రభాస్. వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీ బిజీగా గడిపేస్తున్నారు. స్టార్ హీరోలకు భిన్నంగా ఒకేసారి రెండు మూడు క్రేజీ సినిమాల్లో నటిస్తూ వరుస షూటింగ్‌లతో బిజీగా ఉంటున్నారు. ఈ ఏడాది హారర్ కామెడీ థ్రిల్లర్ –రాజాసాబ్–తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ప్రభాస్ ఇదే ఏడాది మరో భారీ పాన్ ఇండియా మూవీతో ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రియుల్ని అలరించడానికి రెడీ అవుతున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తున్న విషయం తెలిసిందే. –సీతారామం–తో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్న హను రాఘవపూడి డైరెక్షన్‌లో యుద్ధం రాసిన ప్రేమకథగా –ఫౌజీ–ని రూపొందిస్తున్నాడు. ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా కీలక పాత్రల్లో మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి టీ సిరీస్ సంయుక్తంగా ఈ భారీ వార్ లవ్ డ్రామాని నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ మూవీతో పాటు ప్రభాస్ –స్పిరిట్–లో నటిస్తున్న విషయం తెలిసిందే.

క్రే.జీ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్‌రెడ్డి వంగ ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాడు. ఏ విషయంలోనూ రాజీపడకుండా బాడీ డబుల్‌ని కూడా వాడనివ్వకుండా చాలా స్ట్రిక్ట్‌గా ఈ మూవీ షూటింగ్ చేస్తున్నాడు. ఇప్పటికే కీలక ప్యాడింగ్ ఆర్టిస్ట్‌లని రంగంలోకి దించేసిన సందీప్ ఈ మూవీ షూటింగ్‌ని పరుగులు పెట్టిస్తున్నాడు. ఇదిలా ఉంటే ఈ మూవీతో పాటు త్వరలో –కల్కి 2898ఏడీ– సీక్వెల్ షూటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో –ఫౌజీ– డైరెక్టర్‌తో పాటు టీమ్‌కి డెడ్ లైన్ విధించినట్టుగా తెలిసింది. వరుస క్రేజీ ప్రాజెక్ట్‌ల షూటింగ్‌లతో బిజీ బిజీగా గడిపేస్తున్న ప్రభాస్ అనుకున్న టైమ్‌కి సినిమాని థియేటర్లలోకి తీసుకురావాలంటే షూటింగ్ మరింత ఫాస్ట్‌గా చేయాలని భావిస్తున్నాడట. ఇప్పటికే –ఫౌజీ–ని దసరాకు రిలీజ్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నా ఆ సమయానికి రిలీజ్ చేయలేకపోతే తరువాత ప్రాజెక్ట్‌లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన ప్రభాస్ –ఫౌజీ– టీమ్‌కు డెడ్ లైన్ విధించాడట. ఎట్టిపరిస్థితుల్లోనూ సినిమాని పూర్తి చేసి దసరాకు రిలీజ్ చేయాలని చెప్పడంతో ఇప్పుడు టీమ్ రాత్రింబవళ్లు పని చేస్తున్నారట. ఖరెస్ట్ లేకుండా పని చేస్తేనే –ఫౌజీ– అనుకున్న అక్టోబర్‌కు రెడీ అవుతుందని, దాంతో ఇతర సినిమాలకు ఎలాంటి ప్రాబ్లం ఉండదని చెబుతున్నారు. సందీప్ రూపొందిస్తున్న –స్పిరిట్– విషయంలో ప్రభాస్‌కు ఎలాంటి టెన్షన్ లేదు. కారణం ప్రభాస్ రెస్ట్ తీసుకుందామన్నా, బాడీ డబుల్‌తో లాగించేద్దామన్నా సందీప్ రెడ్డి వంగ వినే రకం కాదు. అనుకున్నది అనుకున్నట్టు చేయాల్సిందేనని పట్టుబట్టే రకం కాబట్టి –స్పిరిట్– సందీప్ చెప్పిన టైమ్‌కే వచ్చేస్తుందని ప్రభాస్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడట.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965